# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ప్రయాణ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి
- జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే


ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేటసిటీ, డిసెంబర్ 5: మిగ్ జాం ప్రభావం వల్ల కురుస్తున్న వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలిన ఎస్పీ రాహుల్ హెగ్డే మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ మేరకు జిల్లా పోలీసు అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. అత్యవసర సమాయాల్లో వేగంగా స్పందించి సేవలందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఏదైన అత్యవసరమైతే స్థానిక పోలీసులకు డయల్ 100కు ఫోన్ చేసి పోలీసు సేవలను పొందవచ్చని అన్నారు. ప్రజలు ప్రయాణ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జాతీయ రహదారిపై నెమ్మదిగా వెళ్లాలని, అత్యవసరమైతేనే బయటికి రావాలన్నారు. అధిక వర్షాలతో శిథిలావస్థలో ఉన్న నివాసాల్లో ఉండవద్దని, చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు.

# పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలి


రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ నాగభూషణం

- డీఎస్పీ నాగభూషణం
- రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలు

సూర్యాపేట రూరల్, డిసెంబర్ 5: పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని డీఎస్పీ నాగభూషణం ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం పట్టణ పరిధిలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, రూరల్ ఎస్సై సాయిరాం, ఎఎస్సై వెంకన్న, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు సూర్యాపేట మార్కెట్ యార్డుకు సెలవు

బొడ్రాయిబజార్, డిసెంబర్ 5: మిచౌంగ్ తుఫాన్ కారణంగా రైస్‌మిల్లర్స్, ట్రేడర్స్, కమీషన్‌దారుల కోరిక మేరకు బుధవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఫసీయోద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను ఈ నెల 6న మార్కెట్‌యార్డుకు తీసుకురావద్దన్నారు. ఈ విషయాన్ని రైతులంతా గమనించి మార్కెట్ యార్డు సజావుగా సాగేలా సహకరించాలని కోరారు.


మల్లు వెంకటనర్సింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

# వీఎన్ జీవితం నేటి తరానికి ఆదర్శం

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి

బొడ్రాయిబజార్, డిసెంబర్ 5: పేదల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు మల్లు వెంకటనర్సింహారెడ్డి(వీఎన్) జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. మంగళవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో వీఎన్ 19వ వర్ధంతి ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణలో జాగీర్‌దారులకు, దొరలకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో వీఎన్ కీలక పాత్ర పోషించారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏండ్లు అయినా మహిళలు నిత్యం అణిచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, యాదగిరిరావు, చెరుకు యాకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు గోవింద్, నరసింహారావు, పులుసు సత్యం, వీరబోయిన రవి, మేకనబోయిన శేఖర్, సైదమ్మ, ఎల్గూరి జ్యోతి, ప్రజా సంఘాల నాయకులు రాంబాబు, యాదగిరి, పాటల గోపి, భద్రమ్మ పాల్గొన్నారు.

# ఎడతెరిపి లేని వర్షం

- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచనలు

సూర్యాపేట, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): మిగ్‌జాం తుఫాన్ ఎఫెక్ట్‌తో జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేని ముసురు కురుస్తుంది. సోమవారం అర్ధరాత్రి నుంచి ఓ మోస్తారు వర్షం కురుస్తూనే ఉంది. జిల్లాలో అత్యధికంగా మఠంపల్లి మండలంలో 32 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చివ్వెంల మండలంలో 4 మిల్లీమీటర్లు అత్యల్ప వర్షపాతం నమోదైంది. ఇప్పటికే వానాకాలం సీజన్ కోసం దుక్కులు దున్ని నార్లు పోసిన రైతులకు నీళ్లు అందుతుండగా మిగిలిన రైతులు నీటి కోసం ఎదురు చూడకుండా దుక్కులు దున్నడం, నార్లు పోయనున్నారు. యాసంగి పంటలు జిల్లాలో ఇంకా 10వేల ఎకరాల్లో కోతలు పూర్తి కాకపోగా పెద్దగా నష్టం చేకూరకపోయినా కోతలకు మరో వారం ఆలస్యం కానుంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే నిండుగా ఉన్న చెరువులు, కుంటల్లోకి వర్షపు నీరు కొంతమేర చేరుతుంది. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఓ మోస్తారు నుంచి కొంత మెరుగ్గా వర్షం పడగా సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో మాత్రం జల్లులు పడి చిత్తడిగా మారింది. దాదాపు 24గంటల పాటు ఎడతెరిపి లేని వర్షంతో భూగర్భజలాలు ఉబికి వస్తున్నాయి. వర్షంతో జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బంది పడ్డారు. జిల్లావ్యాప్తంగా 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. మునగాల 29.3 మిల్లీమీటర్లు, మేళ్లచెరువు 28.8, హుజూర్‌నగర్ 25.5, పాలకీడు 23.8, చిలుకూరు 23 గరిడేపల్లి, నడిగూడెం, చింతలపాలెం మండలాల్లో 21 మిల్లీమీటర్లు నమోదు కాగా మిగిలిన మండలాల్లో 20 నుంచి 4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.


సూర్యాపేటలో రెయిన్‌కోట్ ధరించి గొడుగుతో బైక్‌పై వెళ్తున్న వాహనదారులు


మేళ్లచెర్వు మండలం హేమ్లాతండా శివారులో వర్షానికి తడవకుండా ధాన్యం రాశులపై పట్టాలు కప్పిన రైతులు


మఠంపల్లిలో రోడ్డుపై చేరిన వర్షపు నీరు


నేరేడుచర్ల : వర్షం కారణంతో నిర్మానుష్యంగా ఉన్న జాన్‌పహాడ్ రోడ్డు


కోదాడ టౌన్: పట్టణంలో కురిసిన వర్షంతో జలమయమైన రోడ్డు

## అకాల వర్షం

మేళ్లచెర్వు/ గరిడేపల్లి/ కోదాడటౌన్/ కోదాడ రూరల్/ మునగాల/ మోతె/ నడిగూడెం/ మఠంపల్లి/ నేరేడు చర్ల, డిసెంబర్ 5: మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా అకాల వర్షం కురుస్తోంది. సోమవారం అర్ధరాత్రి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం రోజంతా కూడా ఎడతెరిపి లేకుండా జల్లులు పడ్డాయి. అకాల వర్షంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం వర్షానికి తడవకుండా పట్టాలు కప్పుకున్నారు. ఇటీవలి కురిసిన వర్షానికి పంట కిందికి వాలి నష్టం జరిగింది. పంట చేతికందిన ప్రస్తుత సమయంలో తుఫాన్ రావడంతో దాన్ని కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. ఈ వర్షానికి గడ్డి పూర్తిగా తడిసి పోయిందని రైతులు వాపోయారు. పశువుల మేతకు డిమాండ్ పెరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. కురుస్తున్న జల్లుల కారణంగా గ్రామాల్లో వీధులు చిత్తడిగా మారాయి. కోదాడలో సోమవారం అర్ధరాత్రి నుంచి చల్లగాలులతో కూడిన మోస్తారు వర్షం కురుస్తుంది. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పట్టణ ప్రజలు చలితో వణికిపోతున్నారు. కోదాడ మండలంలోని పలు గ్రామాల ఐకేపీ సెంటర్లలోని ధాన్యంతో పాటుగా చివరగా వేసిన వరి పంట దెబ్బతిన్నది. పలువురు రైతుల ధాన్యం తడిసిపోయింది. రైతులు సాధ్యమైనంత వరకు ధాన్యం తడవకుండా పట్టాలు కప్పి తగు జాగ్రత్తలు తీసుకున్న అకాల వర్షంతో కష్టాలు తప్పలేదు. నేరేడుచర్ల మండలంలో వర్షం కారణంగా ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. అత్యవసరమైతే తప్ప బయటికి రావడం లేదు. వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. తుఫాన్ ప్రభావం కారణంగా పట్ట పగలు సైతం చిమ్మ చీకటిని కమ్మేశాయి. మునగాల మండలంలో రెండు రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. నడిగూడెం మండల వ్యాప్తంగా చిరుజల్లులతో ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి. మోతె, మఠంపల్లి మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో మోస్తరు వర్షాలు కురవడంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు. రైతులు పశువులను మేపేందుకు కూడా చాలా తంటాలు పడ్డారు. వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.


మునగాల: తాడువాయిలో గురప్ప వాగు అలుగు పోస్తున్న దృశ్యం


మునగాల: వర్షానికి రోడ్డుపై చేరిన వర్షపు నీరు